# మధుపం

"వదినా, మీ ఫ్రెండ్ అఖిల ఎలా వుంటుంది చూడ్డానికి. నీవు చెప్తుంటావు మంచి తెలివైంది, ఏక్టివ్‌గా, స్మార్ట్‌గా వుంటుందంటావు, అందంగా కూడా వుంటుందా?" నిత్య అడిగింది వదినగారిని. మహిమ కళ్లెత్తి ఆడపడుచు వంక కాస్త అనుమానంగా, మరికాస్త ఆశ్చర్యంగా చూస్తూ, 'ఎందుకు, ఎందుకలా అడిగావూ?'

"ఊరికే, చెప్పు వదినా, నేనెప్పుడూ చూడలేదుగా ఆవిడని. ఆవిడ భర్త మా బాస్ గదా కుతూహలంగా అడిగా అంతే..."

"అఖిలకేం, అందం అంటే, అద్భుత సౌందర్యవతి అనను - కాని నవ్వు మొహం, కళైన మొహం, మంచి వత్తు జుత్తు ... అన్నింటికంటే ఎక్స్‌ప్రెసివ్ కళ్లు - మొహం చూడగానే తెలివైనదని, మంచి ఆకర్షణ వుందన్నది అందరికి తడ్తుంది. నలభై ఏళ్ళు వచ్చినా యింకా చక్కని ఫిగర్ మెయిన్‌టైన్ చేస్తూ స్మార్ట్‌గా వుంటుంది. కాలేజీలో ఉన్నప్పుడు ఎంత లైవ్లీగా వుండేది. మంచి స్నేహితురాలు... అందరితో కలుపుగోలుగా వుండి సెంటర్ పాయింట్‌లా వుండేది..."

"మరి అంత చక్కని, మంచి భార్య వుండగా... యిదేం రోగం..." చటుక్కున ఆగిపోయింది నిత్య. మహిమ చురుగ్గా చూసి...'ఏమిటి, ఏమటంటున్నావు...' అంది.

నిత్య చూపు తప్పించి, 'అబ్బే ఏంలేదు ... వూరికే ...' అంది.

'ఊరికే ఏం అడగలేదని నాకు తెలుసు. చెప్పు... ఏమిటి విషయం ఎవరి గురించి మాట్లాడుతున్నావు. చెప్పు ఫరవాలేదు'.

'వదినా, మా ఆఫీసులో మేధ అని రెండు మూడు నెలల క్రితం ఓ అమ్మాయి జాయిన్ అయింది. ప్రస్తుతం కార్తీక్‌గారి పర్సనల్ సెక్రటరీ...'

"అయితే" అనుమానంగా అడిగింది మహిమ. నిత్య కాస్త ఆగి.. 'వదినా కార్తీక్‌గారు మేధ ... ఇద్దరూ చాలా క్లోజ్‌గా వుంటున్నారు....'

'ఛ ... ఛ... అదేంటి కార్తీక్ అలాంటివాడేం కాదు. అఖిల అతను యిద్దరూ చాలా హ్యాపీ కపుల్... అయినా అతడేమన్నా చిన్న కుర్రాడేంటి, నలభై దాటినవాడు. ఇద్దరు కాలేజీ గోయింగ్ పిల్లలు... అలాంటిదేం ఉండదు. పర్సనల్ అసిస్టెంట్ కనుక యిద్దరూ ఒకరితో ఒకరు ఎక్కువ మాట్లాడవలసి వస్తుంది గదా!'

'వదినా, ఏమిటి అవన్నీ నాకు తెలియవంటావా, నేనేంటి అందరూ చెప్పుకుంటు న్నారు. అందరికన్నా ఆఖరికి నాకు తెల్సింది. ఇదివరకు సౌమ్య అనే అమ్మాయి పర్సనల్ అసిస్టెంట్‌గా ఉండేది. ఎంత హుందాగా ఉండేది. ఏమిటో ఈ మేధని చూస్తేనే అదోరకంగా అన్పిస్తుంది.'

"మీకందరికీ యిలాంటి అనుమానం రావడానికి ప్రత్యేక కారణం ఉందా. ఎవరన్నా ప్రత్యక్షంగా ఏదన్నా చూశారా. వూరికే ఊహాగానాలు..."

"మా కొలీగ్ అనంత్ ఆదివారం ఓ రెస్టారెంట్‌కి ఫ్యామిలీతో వెడితే వీళ్లిద్దరూ డిన్నర్ తీసుకుంటున్నారుట. ఇతన్ని చూసి కార్తీక్ కాస్త తడబడ్డాడుట. ఇంకోసారి లలిత అన్న రిసెప్షనిస్టు యిద్దరూ కారులో వెడ్తుంటే చూసిందిట. ఎవరి దాకానో ఎందుకు నేను చూసా ప్రత్యక్షంగా ..." ఆగిపోయింది నిత్య.

"ఏం చూశావు?" కళ్ళు చిట్లించి చూసింది. నిత్య తలదించుకుంది. 'వదినా ఓ రోజు నా ప్రాజెక్టు తాలూకు సి.డి. కార్తిక్‌గారి టేబుల్‌మీద వుందని మా ప్రోగ్రాం ఎనాలసిస్ట్ చెపితే తెచ్చుకోడానికి వెళ్ళాను. కార్తీక్‌గారు యింకా రాలేదనుకుని తలుపు తట్టకుండానే తలుపు తోశాను. కార్తీక్‌గారు కుర్చీలో కూర్చుంటే ఈవిడగారు కుర్చీ వెనకనించుని ఆయన భుజాల మీద చేతులాన్చి తలలు దగ్గర చేసికుని తన్మయత్వంతో మాట్లాడుకుంటున్నారు. నేను, నాతోపాటు వాళ్ళూ షాకయ్యారు. నేను వెనక్కి పారిపోయి వచ్చేశాను గాభరాపడి..."

మహిమ తెల్లపోయింది. "నిజం ... నిజంగా... కార్తీక్..." నమ్మలేనట్టు అడిగింది.

"అవును వదినా, పబ్లిక్‌గా ఆఫీసుటైంలో అంత నిర్భయంగా ఇద్దరూ ... లక్కీగా నేను అఖిల గారి స్నేహితురాలి ఆడపడుచునని కార్తీక్ గార్కి తెలియదులే... ఆరోజు

నామొహం ఆయనకెలా చూపాలో అర్థం కాలేదు... కార్తీక్‌గారు బయటికి వచ్చి చాలా గంభీరంగా నా క్యాబిన్‌వైపు చూపు విసిరి వెళ్ళిపోయారు."

వింటున్న మహిమ మొహం నల్లబడింది. "ఛీ... శుభ్రమైన పెళ్ళాం, టీనేజ్ పిల్లల్ని పెట్టుకుని యీ కుర్రవేషాలేమిటి. పెద్ద పొజిషన్‌లో వుండి ఇంతచీప్‌గా ... ఛా.."

"అది సరే... యింత జరుగుతున్నా మీ అఖిలగారేమిటి అలా నిమ్మకు నీరెత్తినట్టు వుంది."

'దానికేం తెలుస్తుంది, ఆఫీసులో జరిగే భాగోతం...'

'సెల్‌ఫోనులో ఎస్సెమ్మెస్‌లు చూసి ఉండకపోవచ్చు...' నిత్య నెమ్మదిగా అంది. మహిమ ఆశ్చర్యంగా చూసింది. "ఎస్సెమ్మెస్‌లా... ఎవరు పంపారు. నీకెలా తెలుసు?"

"నేనే పంపానొదినా... నాకెందుకో పాపం అఖిలగారినిలా మోసం చేయడం బాధనిపించింది. ఆవిడకి సంగతి తెలియాలి కనీసం. తరువాత ఆవిడిష్టం ఏంచేసినా అనిపించి వరుసగా మూడు రోజులు పంపించాను. ఆవిడవి చూసి వుంటే కుతూహలం కోసమన్నా నానెంబరుకు ఫోనుచేసి ఎవరు పంపారన్నది తెల్సు కునేదిగా..."

"దానికి తెలియచేయడం సరి అయినపనా, పాపం అనవసరంగా దాని మనసు బాధపడ్తుంది... నీవు నాకు ముందుగా ఎందుకు చెప్పలేదు. పాపం అఖిలకిదంతా తెలిస్తే ఎలా తట్టుకుంటుంది... నీవు ఎస్సెమ్మెస్‌లు పంపకుండా వుండాల్సిందేమో..."

"అదేమిటొదినా, ఓ భార్యగా భర్త ప్రవర్తన తెల్సుకోవల్సిన అవసరం లేదా!" మహిమ అయోమయంగా, నిస్సహాయంగా చూసి ... "ఆలోచించాలి, దాంతో చెప్పాలో వద్దో ఆలోచిస్తాను..."

* * * * * *

సెల్‌ఫోన్‌లో పేరుకుపోయిన ఎస్సెమ్మెస్‌లు ఒక్కొక్కటి డిలీట్ చేస్తూ పోతూంటే ఓ ఎస్సెమ్మెస్... తెలుగు అక్షరాలని ఇంగ్లీషులో రాసిన ఆ మెసేజ్ చూసి టక్కున ఆగిపోయింది అఖిల..." ఆఫీసులో, సెక్రటరీ మేధతో మీ వారి ప్రేమాయణం గురించి మీకు తెలుసా, కళ్ళు తెరిచి చూడండి. శ్రేయోభిలాషి..." తారీకు చూసింది. ఎప్పుడో నాల్గు రోజుల క్రితం యిచ్చింది. ఫ్రం నంబరు చూసింది. తెల్సిన నంబరులా

అన్పించలేదు. ఒక్క క్షణం ... ఆగి... డిలీట్ చేయకుండా సేవ్‌చేసి యింకా ముందుకి వెడ్తుంటే మరో రెండు మెసేజ్‌లు కన్పించాయి మొన్న, నిన్న తారీఖులతో... అదే నంబరు. అదే మెసేజ్... ఆఖరుదానిలో మరో వాక్యం... "ఇదేదో జోక్ కాదు నిజం" అని వుంది. మిగతావన్నీ డిలీట్‌చేసి ఆ మూడు సేవ్ చేసింది అఖిల. పిచ్చి పిచ్చి ఎస్సెమ్మెస్‌లు రోజుకి ఎన్నో వస్తాయి. ప్రకటనలు, జోక్‌లు, సెల్‌ఫోన్ ఆఫర్లు అవన్నీ చదివే తీరికే వుండదు. ఆఫీసు కారులో వెనకసీటులో, కూర్చుని ఒక్కసారి డిలీట్ చేసిపడేస్తుంది. అలా ఆఫీసుకెళ్లే నలభై నిమిషాల ప్రయాణంలో ఇమెయిల్స్, సెల్‌ఫోన్ మిస్‌డ్ కాల్స్, మెసేజ్‌లు చదువుతూంటుంది. ఇంట్లో టిఫిను తినే టైము కూడా లేక రెండు శాండ్‌విచ్‌లు టిఫిన్ బాక్స్‌లో తెచ్చుకుని కారులోనే ఓ అరటి పండు తిని బ్రేక్‌ఫాస్ట్ అయిందనిపిస్తుంది అఖిల. ఉదయం ఐదున్నరకి లేచి కాఫీలు, టిఫిన్లు, నల్గురికి లంచ్‌బాక్స్‌లు, టిఫిన్ బాక్సులు కట్టి, స్నానం చేసి ఆదరాబాదరా ముస్తాబై గృహిణి అవతారం చాలించి కార్పొరేట్ ఉద్యోగినిగా కారెక్కి ఆ నలభై నిమిషాల్లో పేపరు కూడా చదవడం ముగించి, తలెత్తకుండా ఐదు వరకు పని పని, ఏ ఆరుకో బయలుదేరితే ఓ గంట గంటన్నర ప్రయాణం చేసి ఇల్లు చేరి మళ్లీ ఇంట్లో గృహిణి అవతారం మధ్య నలిగిపోయే వేలాది మంది గృహిణుల్లో అఖిల ఒకరు. ఇలాంటి ఎస్సెమ్మెస్‌లు చదివి పట్టించుకునే తీరిక లేని బిజీ లైఫ్ ఆమెది.

ఆ మెసేజ్ ఎంత వద్దనుకున్నా ఆమెలో ఇంతో అంతో కలవరం రేపింది.

అందులో ఎంత నిజం అన్నది ఆలోచించే టైము ఓపిక లేవు ఆమెకి. మనసులో ఓ మూల ఆ వార్త స్థానం సంపాదించుకుంది ఆమెకు తెలియకుండానే.

* * * * * *

"హల్లో... నా నెంబరుకు మెసేజ్ వచ్చింది మీ నెంబరు నుంచి. దయచేసి మీరెవరో, అలాంటి మెసేజ్ ఎందుకు ఇచ్చారో చెప్పగలరా...!"

ఒక్క క్షణం అటునించి నిశ్శబ్దం... "హల్లో, ప్లీజ్, మీరెవరు, నాతో గేమ్స్ ఆడుతున్నారా..." అఖిల కాస్త గట్టిగా అడిగింది... 'ధైర్యముంటే చెప్పండి మీరెవరో... అందులో నిజానిజాలెంతో చెప్పండి."

'మేడమ్... మీతో గేమ్స్ ఆడవల్సిన అవసరం నాకేం లేదు. మీ శ్రేయోభిలాషిగా మీకీ విషయం తెలియాలని చెప్పాను. నమ్మేదీ మానేదీ మీ ఇష్టం."

"మీరెవరు. మీకెలా తెలుసు ఈ విషయం..." అట్నించి కాసేపు మౌనం.

"అదంతా అవసరమా. నే చెప్పిందానిలో నిజానిజాలు మీరే తెల్సుకోండి...' ఫోను పెట్టేసిన శబ్దం. అఖిల విసుగ్గా సెల్ పక్కన పడేసింది... ఓ అమ్మాయి మాట్లాడింది అంటే ఇందులో నిజం వుందేమో. అదే మొగ గొంతుకయితే తనని ఏడిపించడానికో, పనిపాటలేకో సరదాగా చేసారేమో అనుకోవచ్చు... అన్పించింది అఖిలకి. రెండు మూడు సార్లు ఆ సెల్‌నెంబరుకి ఫోన్ చేశాక ఈరోజు మాట్లాడ గల్గింది. మాట్లాడాక సమస్య తీరకపోగా మరింత ఆలోచనలో పడేసింది అఖిలని.

* * * * * *

రాత్రి డైనింగ్ టేబిల్ దగ్గిర నల్గురు కూర్చుని భోజనం చేస్తుంటే ఆ మెసేజ్‌లు గుర్తు వచ్చి కార్తీక్ మొహం పట్టిపట్టి చూసింది అఖిల. కార్తీక్ భోంచేస్తూ కొడుకు కూతురుతో సరదాగా మాట్లాడుతున్నాడు. "డాడీ, డాడీ నాకు ఓ స్కూటీ కొనాలి. డాడీ. మా ఫ్రెండ్స్ ఇళ్లకి వెళ్లాలంటే ఆటోలో అంటే బోర్. కొన్నిచోట్ల ఆటోలు దొరకడం లేదు. 'ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న ముగ్ధ తండ్రి దగ్గర ముద్దులు గునుస్తోంది. "హైదరాబాదులో ... యీ ట్రాఫిక్‌లో స్కూటీనా ... నో వే, అది మాత్రం అడక్కు... సేఫ్ కాదు, వద్దు నాన్నా" కార్తీక్ కూతురికి నచ్చజెప్పాడు.

"డాడీ, ఐ.ఐ.టి. ఎంట్రన్స్ డేట్ అనౌన్స్ చేశారు చూశారా. ఇంటర్ పరీక్షలయిన పది రోజులకే... అసలు టైమివ్వలేదు...ఎలా చదవాలి..." టెన్షన్ ఫీలవుతూ అన్నాడు మానవ్. "ఎప్పుడూ అంతే గదా... ఎంట్రన్స్‌లన్నీ ఒకదాని తర్వాత ఒకటి అవుతూనే ఉంటాయి. మరి అందుకేగా ఇంటర్ ఫస్టియర్‌నించి కోచింగ్‌లో జాయిన్ అయింది. ఎలా వుంది ప్రిపరేషన్. కొడుకుతో మాట్లాడుతున్న కార్తీక్‌ని చూస్తే ఎంత బాధ్యతగల తండ్రి... ఓ భర్త, ఇంటియజమాని. పెద్ద ఉద్యోగస్థుడు. నలభైనాలుగు ఏళ్లుండి యిలా చిల్లర మల్లరగా అమ్మాయిలతో అఫైర్ జరుపుతాడా... మౌనంగా తింటూ అన్యమనస్కంగా ఉన్న అఖిలని చూసి "ఏమిటలా నిశబ్దంగా కూర్చున్నావు... డల్‌గా ఉన్నావు వంట్లో బాగులేదా!' కార్తీక్ భార్యని చూస్తూ అడిగాడు. అఖిల తలెత్తి కార్తీక్‌వైపు సూటిగా చూసింది. జవాబివ్వలేదు. ఆ చూపుకి కాస్త తడబడి, "ఏంటి, ఏమయింది," అడిగాడు.

"ఏం లేదు చూస్తున్నాను మిమ్మల్ని. ఏదో కొత్తగా కన్పిస్తోంది మీ మొహం" అంది.

కార్తీక్ ముందు కాస్త తడబడి సర్దుకుని, ఏమిటి... 'ఏమిటి కొత్తగా ఏం కొమ్ములు మొలిచాయా నా మొహంలో' జోక్‌గా అనేశాడు. "అదే, కొమ్ములు ఈ వయసులో

ఎందుకు మొలిచాయా అనే చూస్తున్నాను" సరదాగా అన్నట్టే అంది. 'కమాన్ మమ్మీ... డాడీని ఎందుకలా ఏడిపిస్తున్నావు" ముద్దుల కూతురు తండ్రి పక్షాన మాట్లాడింది.

"ఏమిటో .. ముగ్ధా, మీ నాన్న ఏమిటో ఎంగ్‌గా, ఫ్రెష్‌గా, కనిపించడంలేదూ ఈమధ్య. ఏమిటో మార్పు అని చూస్తే ఇవాళ అర్థమైంది."

కార్తీక్ మొహంలో రంగు మారింది.

"పో, మమ్మీ మా డాడీ ఏం మారారు. నాకేం కనపడలేదు.'

'నీకు తెలీదులే, చిన్న పిల్లవి... మొగుడు కదా, నాకు తెల్సినట్టు నీకెలా తెలుస్తుంది ఆ మార్పు' రెట్టించింది నవ్వుతూ.

'ఏంటి డాడీ. మమ్మీ కొత్తగా మాట్లాడుతుంది?' 'ఏమో మీ మమ్మీనే అడుగు' నవ్వుతూనే అన్నా ఆ కళ్ళలో బెరుకు స్పష్టంగా కనిపించింది అఖిలకి.

* * * * * *

"ఏం తల్లీ! ఇన్నాళ్ళకి గుర్తు వచ్చానా. ఏమయిపోయావు ఇన్నాళ్ళూ. ఓ ఫోనన్నా లేదు. ఏమిటి మహీ, మనం బొత్తిగా మరమనుషుల్లా తయారవుతున్నాం. మానవ సంబంధాలన్నవి లేకుండా పోతున్నాయి. ఒక ఊర్లో వుండి, నెలకోసారన్నా మాట్లాడు కోలేక పోతున్నాం. మూడు నాలుగు నెలలకోసారన్నా కలుసుకోలేక పోతున్నాం.' అఖిల గబగబా అంది. 'ఏయ్, ఆపు, ఏం అనకుండా ముందరి కాళ్ళకి బంధాలు వేయడం, ఏం తెలివే తల్లీ. ఫోను చెయ్యంది, కల్సుకోనిది నేనా నీవా.' మహిమ దబాయింపుగా అంది.

"సారీ... సారీ... నాదే తప్పు. ఏం పాడు ఉద్యోగాలే... మనిషిలో శక్తి పీల్చేసి నిర్జీవంగా తయారుచేస్తున్నాయి. నీకేం తల్లి లెక్చరర్ ఉద్యోగం. బోలెడు తీరిక. కావల్సినన్ని శలవులు. ఈ ఇంజనీరింగులు, ఎమ్మెస్‌లు చేసి మేం ఇలా యిరుక్కు పోయాం."

"సర్లే యీ గోల ఎప్పుడూ వుండేదేగా. నిన్ను చూడాలి. మనం ఎప్పుడు కలుద్దాం. రేపు ఆదివారం రాగలవా... పోనీ ఇద్దరం సరదాగా ఐమాక్స్ సినిమాకి వెడదామా!

"ఆ... ఆ ..." చిన్న పిల్లల్లా సంబరంగా అంది..."ఎన్నాళ్లయిందే సినిమా చూసి పిల్లల్ని కూడా రమ్మందామా..." 'వద్దు వద్దు మనిద్దరమే... మనం మాట్లాడుకోవాలి.'

'పోనీ సినిమాకి వద్దు. లుంబిని పార్కుకు రా... ఫ్రీగా మాట్లాడుకోవచ్చు.'

'ఏమిటి, ఎనీ ప్రాబ్లమ్...!' ఆరాటంగా అంది అఖిల...'అదేం లేదు. రా, ఆరుగంటల కల్లా రావాలి!' ఫోను పెట్టేసింది.

* * * * * *

"అయితే అన్నీ తెలిసి కూడా తెలీనట్లుండి పోతావా!" అప్పటికి అరగంట నించి ఇద్దరి స్నేహితురాళ్ళ మధ్య ఆ విషయమే మాటలు జరుగుతున్నాయి. "అతనికి, నీకీ విషయం తెల్సునన్న విషయమైనా తెలిస్తే కాస్త భయపడి పిచ్చి వేషాలు మానుతాడుగా..."

"అబ్బ మహీ, చూడు నిజం చెప్పాలంటే నాకీ విషయం మాట్లాడాలంటే, తల్చుకోవాలంటే విసుగ్గా అసహ్యంగా వుంది. ఏదో ఏడవనీ అని వదిలేయాలని పిస్తోంది. అవన్నీ అడిగితే అబద్ధాలు, వాదాలు, మాటల యుద్ధాలు, అరుపులు, కేకలు, గొడవలతో మనశ్శాంతి పోగొట్టుకోవాలని లేదు. ఇంట్లో టీనేజ్ పిల్లలు, వాళ్ళ చదువులు, డిస్టర్బ్ అయి వాళ్ళు భయపడి, బాధపడి యిల్లంతా అశాంతి నింపుకోవాలని లేదు. సాక్ష్యాలు చూపి నిలదీస్తే, నా ఇష్టం అంటే నేనేం చెయ్యాలి. తెలిశాక నోరు మూసుకుని నిస్సహాయంగా సహించడం నా ఆత్మాభిమానాన్ని పణంగా పెట్టడం కంటే, తెలీనట్టు ఉండిపోవడం నయం అన్పించింది."

మహిమ ఆశ్చర్యంగా చూసింది. 'నీలాంటి పెద్ద చదువున్న పెద్ద ఉద్యోగస్థురాలూ ఇలా ఆలోచిస్తే మామూలు ఆడదాని సంగతేమిటాని...'

'మహీ, ప్రాక్టికల్‌గా ఆలోచించు. ఈ విషయంలో మొగుడితో దెబ్బలాడి విడిపొమ్మంటావా, విడిపోయి ఈ వయసులో నే సాధించేదేముంది. ఇద్దరు టీనేజ్ పిల్లలు, వాళ్ళ పైచదువులు, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు... ఇవన్నీ ఒక్కచేతిమీద లాక్కు రాగలనా. పిల్లలకి వాళ్ళ నాన్నతో ఎంత ఎటాచ్‌మెంట్. తండ్రిని దూరం చేశానని నామీద కోపం, ద్వేషం పెంచుకోవచ్చు. ఇంట్లో ఈ టెన్షన్, అశాంతి, నా ఉద్యోగం మీద పడవచ్చు. ఇప్పటికే ఆఫీసులో టెన్షన్ భరించలేకపోతున్నాను. ఇంట్లో కూడా శాంతి లేకపోతే... అందుకే ఏదో ఏడవనీ, ఈ మగాళ్ళకీ మోజులన్నీ నాల్గురోజుల ముచ్చటే! మగాళ్ళకి పెళ్ళయ్యాక 'సెవెన్ ఇయర్ ఇచ్' అని మొదలవుతుందట. పెళ్ళాం కాస్త పాతబడి, ఇద్దరు పిల్లలు పుట్టుకొచ్చాక కొత్త రుచుల కోసం ఆరాటపడ్తారుట. మా ఆయనకి ఈ 'ఇచ్' కాస్త ఆలస్యంగా వచ్చిందికాబోలు. నలభై ఏళ్ళు దాటాక వాళ్ళలో ఇంకా అమ్మాయిలని ఆకర్షించే శక్తి వుందా. రొమాంటిక్

ఫీలింగ్స్ మిగిలాయా... టెస్ట్ చేసుకోవడం కోసం కొత్త రుచుల వైపు దృష్టి మళ్ళుతుందిట.

ఎవరో సైకాలజిస్టు రాశాడులే. ఈ పిచ్చి వెర్రిలన్నీ వాటి తాలూకు ప్రభావమే. దానికి తగ్గట్టు మేధ లాంటి అమ్మాయిలు బాస్‌ని ఇంప్రెస్ చేసి స్వార్థ ప్రయోజనాల కోసం బాస్‌లకు దగ్గరయి లొంగిపోతుంటారు. ఈ 'దురద'లన్నీ నాల్గురోజుల ముచ్చటలే! ఏ మగాడూ భార్య, పిల్లలు, ఇల్లు, సంసారం వదులుకోడు. ఇదో పార్ట్ టైమ్. రొటీన్ నించి ఆట విడుపు. సమాజంలో భార్య స్థానం ఎప్పటికీ పోదు. దానికున్న ప్రాముఖ్యం దానిదే. నా స్థానం పదిలం... తేనెటీగ తేనెను వెతుక్కోవడం సహజ లక్షణం. అలాగే మగవాడూ... ఆ ఆరాటం తీరేది కాదు. ఆ బుద్ధి మారేదీ కాదు. దీనికోసం ప్రశాంతతని భగ్నం చేసుకోవడం అవివేకం గదా!

"పోవే, నీలాంటి ఆడవాళ్ళే ఇంతలా నిర్వీర్యమైపోయి సర్దుకు బతికేద్దామనుకోవడం నిజంగా ఆశ్చర్యంగా... కాదు షాకింగ్‌గా అనిపిస్తూంది నాకు..."

"మహీ, ఇంటికెళ్లి తీరిగ్గా ఆలోచించు.. వాటెవర్ ఇటీజ్. నాకు ఇంట్లో ప్రశాంతత కావాలి. రొటీన్ లైఫ్ నుంచి సమస్యలు, ఆందోళనలు, అపశ్రుతులు సృష్టించుకోవడం వద్దు.... ఏమిటలా చూస్తున్నావు..." అఖిల ప్రశాంతంగా అంది.

"ఏంలేదు, ఓ భర్త మరొక స్త్రీతో తిరుగుతాడని తెలిసీ పట్టించుకునే కోరిక, తీరిక భార్యకు లేదు అనుకునేటంతగా మానవ సంబంధాలు దిగజారిపోతున్నాయి. చదువు, ఉద్యోగం, సంపాదన తప్ప మనిషికి మరోటి అక్కరలేనంతగా భార్యాభర్తల మధ్య ఉండాల్సిన అనుబంధాలు, ఆప్యాయతలు, అనురాగాలు, భర్త దూరం అయితే పడే బాధ, అవమానం, అసహనం, తన వాడు అనుకునే దగ్గరితనం ఏమీ లేకుండా ఏదో ఏడవనీ అనుకునే నిర్లిప్తత, నిస్తేజం మానవసంబంధాలలో వచ్చేశాయి అని ఆశ్చర్యంగా వుంది. "నిజమే, ఇదే, ఇదివరకటి భార్య అయితే ఏడ్చి రాగాలు పెట్టి, అలిగి, తిండి మాని, పుట్టింటికి పోతానని బెదిరించి, సాధించి, నలుగురితో చెప్పుకుని నిస్సహాయంగా ఏడిచేది. అలా ఉండమంటావా నన్ను ఇప్పుడు.." నవ్వింది అఖిల.

"అలా కాదు... ఇంత ఈజీగా, పోనీలే.. ఏదో సరదా, మోజు అనుకునే నిర్లిప్తత..."

"ఈజీగా వదలద్దంటావా. సర్లే అయితే... ఓ పనిచెయ్యి... మీ ఆడపడుచుతో చెప్పి కార్తీక్‌కి ఓరెండు మూడు ఎస్సెమ్మెస్‌లు పంపమను." చిలిపిగా అంది. 'మీ శ్రీమతి ఆఫీసులో వాళ్ళ బాస్‌తో... అహ బాస్ వద్దు... ముసలాడు. కొలీగ్ అందంగా

ఎవరున్నారు కాస్త స్మార్ట్‌గా, రొమాంటిక్‌గా వుండేదెవరు... ఆ, ఆదిత్య అగర్వాల్ అనే కొలీగ్‌తో ప్రేమాయణం సాగిస్తూంది కళ్ళు తెరవండి అని మెసేజ్‌లు కొట్టించు. కార్తీక్‌కి ఓ ఝలక్ ఇద్దాం... ఏం...'

మహిమ ఆశ్చర్యంగా నోరు తెరిచి చూస్తూ ఉండిపోయింది. 'ఏయ్ మహీ... ఏమిటంత ఆశ్చర్యపోతున్నావు. నే చెప్పినట్టు చేయించు. మిగతాది నే చూసుకుంటా...' నవ్వుతూ అంది.

"మహీ, నీవన్నది నిజమే, మరి అంతలా పట్టనట్టు వదిలేయకూడదులే. అలా అని ఇంట్లో గొడవలూ ఉండద్దు. భార్య అంటే మరీ అంత నిర్లక్ష్యమూ ఉండకూడదులే..."

మహిమ ఇంకా అలా తెల్లపోయి చూస్తుండగా, అఖిల లేచి చీరదులుపుకుని... పద వెడదాం, టేకిట్ ఈజీ... అంటూ 'నే చెప్పిన ఎస్సెమ్మెస్‌లు మర్చిపోకు...' అంటూ మహిమ చెయ్యి పట్టుకు లేవదీసింది.

* * * * * *

ఐదు రోజులు గడిచాయి. గత మూడు రోజులుగా కార్తీక్ మొహంలో మారే హావభావాలు స్పష్టంగానే చూడగలుగుతోంది అఖిల. కోపం, అసహనం, సందిగ్ధత, అపనమ్మకం, కలవరం, అడగాలి అనుకున్నా అడగలేని అధైర్యం, అఖిలవైపు దొంగచూపులు... మొహం గంటుపెట్టుకొని అన్యమనస్కంగా వుండటం... ఆ రోజు రాత్రి 'ఏం ఒంట్లో బాగులేదా అలా వున్నారేం...' మొఖానికి చేతులకి క్రీము పట్టించుకుంటూ అడిగింది అఖిల బెడ్‌రూములో.

'ఒంట్లో ఏం రోగం' విసురుగా జవాబు. 'మరేంటి ఆఫీసు ప్రాబ్లమా?' నీవే నా ప్రాబ్లమ్ అనాలనుకున్నా అనలేకపోయాడు. 'సర్లెండి, చెప్పాలని లేకపోతే మానేయండి. తలగడలు సర్దుకుని పడుకుంది. కార్తీక్ కటువుగా "చెప్పాల్సింది నీవు..." అన్నాడు. 'నేనా, ఏం చెప్పాలి?' అమాయకత నటించింది.

'దీనికి జవాబు...' సెల్ ఫోన్ తీసి మెసేజ్ ఓపెన్ చేసి అఖిల కళ్ళముందు ఆడించి

"ఎవడో పనీ పాటా లేనివాళ్ళిచ్చే మెసేజ్‌ల గురించి నేనేం చెప్పాలి!" అంది.

"ఎంత పనిలేని వాడన్నా ఊరికే ఎవరూ ఇవ్వరు. కాస్తో కూస్తో నిజం లేనిదే."

ఉక్రోషంగా జవాబివ్వమన్నట్టు సూటిగా చూశాడు. అంతే సూటిగా అఖిల చూసి "కాస్తో కూస్తో నిజాలుండవచ్చు... ఏ కొలీగ్‌తోనో లంచ్‌కో డిన్నరుకో వెళ్ళచ్చు. కారులో ఎక్కడికన్నా వెళ్ళచ్చు, సరదాగా ఏ పార్కుకో వెళ్ళి ఉండొచ్చు..." నిర్లక్ష్యంగా అంది.

"పరాయి మగాడితో సినిమాలకి, హోటళ్లకి, షికార్లకి వెళ్లడం... ఇవన్నీ కాస్తో కూస్తో నిజాలన్న మాట..." వ్యంగ్యంగా అన్నాడు.

"అంతే మరి, అలాగే అనుకోండి. ఆడవాళ్ళం, ఉద్యోగాలు చేస్తున్నాం, మీలాగే మాకూ రొటీన్ నించి బోరు కొడితే ఎక్కడికన్నా వెళ్ళాలనిపించవచ్చు. కాస్త థ్రిల్ కోసం ఏ క్లబ్బుకో వెళ్లచ్చు కొలీగ్‌తో... లైఫ్ బోరు కొట్టి కాస్త మార్పు కావాలనిపించడం తప్పా. ఏం మీ మగాళ్లు అమ్మాయిలని వెంటేసుకు వెళ్ళరా ఎప్పుడూ," సూటిగా అడిగింది.

'అంటే మాతో వంతు పోతున్నారన్నమాట. అంటే మగాళ్లు చేస్తే మీరు చేస్తారా? రిలాక్స్ అవడానికో, థ్రిల్ కోసం ఇంకో మగాడితో తిరిగితే తప్పేం ఉంది అనే వరకు వచ్చిందా వ్యవహారం' కోపంతో మాటలు తడబడ్డాయి.

'అవును మరి. ఇన్నాళ్లు పాపం ఆడవాళ్లు ఇంటికే పరిమితమయ్యారు. ఇలాంటి వన్నీ పాపం వాళ్ళకి అందుబాటులో లేక భర్తగారి తిరుగుళ్లు తెలిసీ భరించేవారు. ఇప్పుడు ఆడవాళ్లు చదివి, మగాడితో సరిగా సంపాదిస్తున్నప్పుడు వాళ్ళకుండే అవకాశాలని వాళ్ళూ అందిపుచ్చుకోవాలనుకోవడంలో తప్పుందా?' నిలదీసింది. కార్తీక్ తెల్లబోయాడు. ఏం మీ మగాళ్లకేనా 'సెవెన్ ఇయర్ ఇచ్‌లు' నలభై ఏళ్ల యవ్వనాలుండచ్చు. పెళ్లాం కాస్త పాతపడి, పిల్లలు పుట్టుకురాగానే కొత్త రుచులు, థ్రిల్స్ కోసం ఆరాటపడి రొమాంటిక్ హీరోల్లా కొత్త మోజుల వెంట ఆరాటంగా తిరగొచ్చా. ఏం పాపం ఆడవాళ్ళూ మనుష్యులేగా. రొటీన్ లైఫ్‌నించి మార్పుండాలని కోరుకోకూడదా! ఆడవాళ్ళకి 'ఇచ్'లుండకూడదా... కార్తీక్ మొహం ఎర్రబడింది.

"అంటే, ఈ ఎస్సెమ్మెస్‌లు నిజమేనన్నమాట."

"నిజం అనుకుంటే నిజం. ఇలాంటి మెసేజ్‌లు నాకూ వచ్చాయి. నేను పట్టించుకోలేదు. కావాలంటే చూడండి. సెల్ ఓపెన్ చేసి అతని ముందు పడేసింది. కార్తీక్ మొహం మాడిపోయింది. ఈ 'మేధ' ఎవరు అనైనా అడిగానా – భార్యాభర్తలకి ఒకరిపట్ల ఒకరికి నమ్మకం ఉండాలి. మిమ్మల్ని అడిగి, నిలేసి, గొడవచేసి ఏడ్చి

రాగాలెట్టి సంసారం వీధినపడేసుకోవడానికి నేను పాతకాలం ఆడదాన్ని కాదు. నాకు ఇంట్లో శాంతి కావాలి. టెన్షన్స్ భరించే ఓపిక లేదు. ఎదిగిన పిల్లల ముందు గొడవలు పడి వాళ్ళ మనసులు బాధపడి చదువులు డిస్టర్బ్ అయి వాళ్ళ భవిష్యత్తుతో ఆటలాడే హక్కు మనకు లేదు."

"ఈ మెసేజ్‌లు నమ్మావా? నిజమనుకున్నావా?" సంజాయిషీ ఇస్తున్నట్లు అన్నాడు.

"నిజమో అబద్ధమో ఎవరికి వారు ఆత్మ విమర్శ చేసుకోవాలి. నిజమో అబద్ధమో తేల్చుకోడానికి నిమిషం పట్టదు నాకు. నిజమైతే భార్యగా నా హక్కుల్ని వినియోగించుకుని ముక్కుపిండి లక్షలు వసూలు చేసి డైవోర్స్ తీసుకుని నా బతుకు నే బతకగలిగే ధైర్యం వుంది. ఒకరిపట్ల ఒకరు విశ్వాసంతో ఉండాలన్న పెళ్ళి ప్రమాణాలు గుర్తుంటే చాలు" నిబ్బరంగా అంది. అఖిల నించి చూపులు తప్పించి, కాసేపు సందిగ్ధంలో కొట్టుమిట్టాడి 'అయితే ఈ మెసేజ్‌ల్లో నిజం లేదన్నమాట'. చిన్న సందేహం, చిన్న ఆశ! అఖిల అతని వంక చూసి జవాబిచ్చింది. 'చెప్పాల్సింది మీరు, నేను కాదు' అంది. కార్తీక్ మొహంలో కలవరపాటు! కాసేపు ఏదో ఆలోచించి "సరే, లెటజ్ ఫర్‌గెట్ యిట్ నీవన్నట్టు ఈ పిచ్చి మెసేజ్‌లు చూసి మనసు పాడుచేసుకోవద్దు, 'డిలిట్' చేసేద్దాం." అఖిల భుజం మీద చెయ్యేసి రాజీకి వచ్చినట్లున్నాడు.

"సెల్‌ఫోను నించి 'డిలిట్' చేసేయచ్చు ఈజీగా. జీవితాల నుంచి 'డిలేట్' చేయడం అంత సులభం కాదేమో!" భుజం మీద నించి అతని చెయ్యి తీసి మృదువుగా కిందపెట్టి "ఈరోజు నించి నన్ను తాకే అర్హత మీరు పోగొట్టుకున్నారు. లోకానికి మాత్రం మనం భార్యా భర్తలం. పిల్లలకి తల్లిదండ్రులం. ఆ పాత్రని చక్కగా పోషిద్దాం. ఇంత కూడా నేను మాట్లాడదలచలేదు. కాని తప్పుచేసిన భర్తకు భార్యని అనుమానించి నిలేసే అధికారం ఉంటే భర్త ప్రవర్తనకి శిక్షవేసే అధికారం భార్యకీ ఉంటుందిగా.." చాలా నిదానంగా అని పాలిపోయిన కార్తీక్ మొహం ఓసారి చూసి తలగడలు సర్దుకు పడుకుంది.

* * * * * *

పదిరోజుల తర్వాత మహిమ నించి ఫోను. "మేధని బ్రాంచి ఆఫీసుకు ట్రాన్స్‌ఫర్ చేశారుట. నీకు తెలుసా!" అంది. "ఇప్పుడు తెలిసిందిగా" నవ్వింది అఖిల.

*(నవ్యవారపత్రిక - 30 మార్చి, 2011)*